ఎట్టకేలకు వంతెనకు మోక్షం

- తాడిగడప మున్సిపాలిటీ నిధులతో వీడిన గ్రహణం
- నేడు ప్రారంభం


కానూరులో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న వంతెన

పెనమలూరు: కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ వద్ద గత కొన్నేళ్లుగా గ్రహణం పట్టి నిలిచి పోయిన వంతెన(ఫ్లైఓవర్)కు ఎట్టకేలకు మోక్షం లభించింది. వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీ ముందుకు వచ్చి నిధులు సమకూర్చడంతో వంతెన పనులు పూర్తి చేశారు. సోమవారం వంతెనను ప్రారంభించనున్నారు. వివరాల్లోకి వెళ్తే.. కానూరు సనత్‌నగర్ నుంచి గంగూరు వరకు ఉన్న పంట కాలువపై రహదారి నిర్మాణం చేయాలని 2014వ సంవత్సరంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం ప్రతిపాదించింది. సనత్‌నగర్ నుంచి పోలీస్ స్టేషన్ వరకు సీఆర్డీఏ నిధులతో రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణం చేశారు. అయితే వీఆర్ సిద్ధార్థ కాలేజీ లోపల నుంచి ఉన్న పంట కాలువపై రోడ్డు నిర్మాణానికి కాలేజీ యాజమాన్యం అభ్యంతరం వ్యక్తం చేసింది. కాలేజీ లోపల రోడ్డు కాకుండా వంతెన నిర్మించాలని కోరింది. అయితే రోడ్డు నిర్మాణం చేయాల్సిందేనని వంతెన వద్దని స్థానిక టీడీపీ నాయకులు కాలేజీ వద్ద ఆందోళన చేశారు. దీంతో టీడీపీ పెద్దలు కల్పించుకుని వంతెన నిర్మాణానికి అంగీకరించారు. ఈ మేరకు సీఆర్డీఏ, కాలేజీ యాజమాన్యం ఎంవోయూ చేసుకున్నారు. కాలేజీ యాజమాన్యం వంతెన నిర్మాణం చేస్తే, సాండ్ బ్యారియర్స్, లైట్లు, డ్రెయినేజీ సీఆర్డీఏ నిర్మాణం చేయాలని ఎంవోయూలో పేర్కొన్నారు.

ముందుకు రాని సీఆర్డీఏ

కాగా కాలేజీ యాజమాన్యం రూ. 11 కోట్లతో వంతెన నిర్మాణ పనులు చేపట్టింది. అయితే సీఆర్డీఏ ఎంవోయూలో చేసుకున్న ఒప్పందం ప్రకారం నిధులు విడుదల చేయలేదు. నిధులు లేవని సీఆర్డీఏ చేతులెత్తేసింది. అటు టీడీపీ ప్రభుత్వం కూడా నిధులు కేటాయించలేదు. దీంతో నిర్మాణ పనులను కాలేజీయే పూర్తి చేసినా సీఆర్డీఏ సహకరించకపోవడంతో వంతెనకు గ్రహణం పట్టుకుంది. సీఆర్డీఏ అమరావతిపై ఉన్న ప్రేమ వంతెనపై చూపలేదన్న ఆరోపణలు వెల్లువెత్తాయి.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కృషి

కాగా వంతెన నిర్మాణానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కృషి చేసింది. సీఆర్డీఏ నిధులు కేటాయించక పోవడంతో వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీ నుంచి నిధులు మంజూరు చేయించింది. తాడిగడప మున్సిపాలిటీ నిధులతో సాండ్ బ్యారియర్స్‌కు రూ. 50 లక్షలు, డ్రెయినేజీ నిర్మాణానికి రూ. 2.35 కోట్లు, వంతెనపై లైట్లకు రూ. 30 లక్షలు చొప్పున నిధులు కేటాయించారు. వంతెన నిర్మాణ పనులకు తాడిగడప మున్సిపాలిటీకి ఎటువంటి సంబంధం లేకపోయినా నిధులు ఇచ్చింది.

నేడే ప్రారంభం

వంతెనను నేడు మంత్రి నారాయణ ప్రారంభించనున్నారు. ఈ వంతెనపై ప్రయాణించే వారు పోలీస్ స్టేషన్ వద్ద నుంచి నేరుగా కానూరు 100 అడుగుల రోడ్డులోకి రావచ్చు. ఇది ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుంది. దీంతో బందరు రోడ్డుపై ట్రాఫిక్ తగ్గుతుంది. కాగా బీజేపీ ఎమ్మెల్యే, మాజీ కేంద్ర మంత్రి ఇల్లు వంతెన దిగువున ఉండటంతోనే పనులు వేగంగా చేశారనే చర్చ కూడా జరుగుతోంది.

ముగిసిన ఎన్‌సీసీ వార్షిక శిక్షణ శిబిరం


క్యాడెట్లకు సర్టిఫికెట్లు అందజేస్తున్న తీర్థప్రసాద్

గన్నవరం: ఎన్టీఆర్ పశువైద్య కళాశాలలోని 3(ఏ) ఆర్అండ్‌వీ రెజిమెంట్ ఎన్‌సీసీ వింగ్‌లో పది రోజులుగా జరుగుతున్న వార్షిక శిక్షణ శిబిరం ఆదివారం ముగిసింది. శిక్షణ శిబిరంలో పలు కళాశాలలకు చెందిన 266 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు. శిక్షణ ముగియడంతో డెప్యూటీ కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ తీర్థప్రసాద్ చేతుల మీదుగా క్యాడెట్లకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణ, దేశభక్తి కలిగిన భారత పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఎన్‌సీసీ కీలకపాత్ర వహిస్తుందన్నారు. పది రోజుల క్యాంప్‌లో ఎన్‌సీసీ క్యాడెట్లకు వివిధ అంశాలపై పూర్తిస్థాయి శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. గుర్రపు స్వారీ, అక్టోపస్ సిబ్బంది విన్యాసాలు, డాగ్ షో వంటి ప్రదర్శనలు నిర్వహించినట్లు తెలిపారు. గుర్రపు స్వారీ తదితర అంశాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఎన్‌సీసీ క్యాడెట్లను న్యూఢిల్లీలో జరిగే రిపబ్లిక్ డే పరేడ్‌కు పంపుతామన్నారు. క్యాంప్ కమాండెంట్ ఫ్లయింగ్ ఆఫీసర్ రతి, అసోసియేట్ ఎన్‌సీసీ ఆఫీసర్లు లెఫ్టినెంట్ డాక్టర్ ఎల్.జయబాల్, లెఫ్టినెంట్ ఎండీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవుల్లో నూర్‌బాషాలకు అన్యాయం

కంకిపాడు(పెనమలూరు): నామినేటెడ్ పదవుల్లో నూర్‌బాషాలకు తీరని అన్యాయం జరిగిందని నూర్‌బాషా ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ చిన్నా అన్నారు. కంకిపాడు మండలంలోని ఈడుపుగల్లులో సంఘ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం రెండు విడతలుగా వివిధ నామినేటెడ్ పదవులకు చైర్మన్‌ల నియామకం చేసినా ఆ పదవుల్లో ఒక్క నూర్‌బాషా కూడా లేరన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 25 లక్షల మంది నూర్‌బాషా జనాభా ఉన్నారని చెప్పారు. చట్టసభల్లో ఒక్కరికీ ప్రవేశం లభించలేదన్నారు. ఆఖరికి నామినేటెడ్ పదవుల్లోనూ స్థానం లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం నూర్‌బాషా ముస్లింల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఫ్లైఓవర్ నిర్మాణం ఎప్పుడో?


పెద అవుటపల్లి రైల్వే లెవెల్ క్రాసింగ్ వద్ద ఫ్లై ఓవర్ నిర్మించాల్సిన ప్రదేశం ఇదే


గేటు పడటంతో నిలిచిన వాహనాలు

- దశాబ్దాలుగా ఎదురుచూపులు
- పెద్ద అవుటపల్లి రైల్వే లెవెల్ క్రాసింగ్ వద్ద ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

గన్నవరం రూరల్: మండలంలోని తెంపల్లి రోడ్డు మార్గంలో పెదఅవుటపల్లి రైల్వే లెవెల్ క్రాసింగ్ వద్ద ఫ్లై ఓవర్ నిర్మించాలని ఈ ప్రాంత ప్రజలు ఎన్నో దశాబ్దాలుగా కోరుతున్నారు. నేటికీ ఫ్లైఓవర్ నిర్మాణానికి చర్యలు లేకపోవడంతో


పెద అవుటపల్లి రైల్వే లెవెల్ క్రాసింగ్

పడరాని పాట్లు పడుతున్నారు. ఇక్కడ రైల్వే గేటు పడితే చాలు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా తెంపల్లి, వీరపనేనిగూడెం గ్రామాల నుంచి పాల వ్యాపారులు వందల లీటర్ల పాలు సేకరించి నిత్యం విజయవాడ తీసుకువెళుతూ ఉంటారు. ఆలస్యం అయితే పాలు విరిగిపోయే ప్రమాదం ఉండటంతో వాహనాలను వేగంగా నడుపుతూ రైల్వే గేటు దాటేందుకు ప్రయత్నిస్తుంటారు.

గేటు అవతల పారిశ్రామిక ప్రాంతం

పెద అవుటపల్లి రైల్వే లెవెల్ క్రాసింగ్ అవతల వైపు చిన అవుటపల్లి, తెంపల్లి గ్రామాలకు చెందిన పారిశ్రామిక ప్రాంతాలు ఉన్నాయి. వీటిల్లో పదుల కొద్ది పరిశ్రమలు నెలకొల్పారు. మరిన్ని పరిశ్రమలు నెలకొల్పేందుకు పారిశ్రామిక వేత్తలు కృషి చేస్తున్నారు. వీరపనేనిగూడెం గ్రామంలో వందలాది ఎకరాల్లో ఏపీఐఐసీ భూములు ఉన్నాయి. అయితే రైల్వే వంతెన లేకపోవడంతో అటు వైపు వెళ్లడానికి ఇబ్బందులు తప్పడంలేదు.

నిత్యం వేలాది మంది రాకపోకలు

ఈ లెవెల్ క్రాసింగ్ దాటుకుని వెళితే తెంపల్లి, శివారు బల్లిపర్రు, వీరపనేనిగూడెం, కొత్తగూడెం, శివారు గ్రామం మెట్లపల్లి ఉన్నాయి. ఈ గ్రామాల్లో వేలాది మంది జనాభా ఉన్నారు. వందలాది మంది ఉద్యోగులు ఉన్నారు. పారిశ్రామిక వాడల్లో వేలాది మంది పని చేస్తున్నారు. వీరందరికీ లెవెల్ క్రాసింగ్ వద్ద ఫ్లై ఓవర్ నిర్మిస్తే ఎంతో ఉపయోగంగా ఉంటుంది.

ఫ్లై ఓవర్ నిర్మించి ఆదుకోవాలి



ఫ్లైఓవర్ నిర్మిస్తామని ఎప్పటి నుంచో నాయకులు చెబుతున్నారు. అయితే కార్యచరణ దాల్చలేదు. రోజూ గన్నవరం వెళ్లేందుకు ఈ లెవెల్ క్రాసింగ్ వద్దనే సమయం కోల్పోవాల్సి వస్తోంది. ఇప్పటికైనా ఫ్లై ఓవర్ నిర్మించి ఆదుకోవాలి.

– పులపాక రాజారత్నం, బల్లిపర్రు

ప్రయాణాలకు సౌకర్యం



ఫ్లైఓవర్ నిర్మిస్తే ప్రజలకు, రైతులకు, ఉద్యోగులకు ఎంతో మేలు కలుగుతుంది. పారిశ్రామిక ఉత్పత్తులు మరింత ఊపందుకుంటాయి. మరిన్ని పరిశ్రమలు వస్తాయి. దీంతో యువతకు ఉపాధి లభిస్తుంది. ప్రయాణాలు సౌకర్యంగా ఉంటాయి.

– బండి నాగసాంబిరెడ్డి, వీరపనేనిగూడెం

ముస్లింలపై కూటమిది మొసలి కన్నీరు

ముస్లిం సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ముఖ్తార్ అలీ



లబ్బీపేట(విజయవాడతూర్పు): కూటమి ప్రభుత్వం ప్రకటించిన నామినేటెడ్ పదవుల్లో మైనారిటీలకు అన్యాయం జరిగిందని ముస్లిం సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ముఖ్తార్ అలీ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ముస్లింలపై మొసలి కన్నీరు కారుస్తోందని, ద్వితీయ స్థాయి నాయకులకు ఇవ్వాల్సిన పదవులతో సరిపెడుతోందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రకటించిన 79 కార్పొరేషన్ చైర్మన్ పదవులలో ముగ్గురు మాత్రమే ముస్లింలు ఉండడం చాలా బాధాకరమని, హజ్ కమిటీ, వక్ఫ్ బోర్డు, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్, ఉర్దూ అకాడమీ, నూర్ బాషా ఫెడరేషన్‌కు చైర్మన్ పదవులను ముస్లింలకు ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. జనరల్ కేటగిరీలో ఉన్న కార్పొరేషన్ చైర్మన్ పదవులు కనీసం 15మంది ముస్లింలకు కేటాయించాలని కోరారు. కూటమి ప్రభుత్వం ప్రకటించిన 79 కార్పొరేషన్ చైర్మన్ నామినేటెడ్ పదవుల్లో జనరల్ కేటగిరిలో ఒక్క ముస్లిం పేరు కూడా లేదని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ప్రకటించిన మొదటి 20 కార్పొరేషన్లలో వక్ఫ్ బోర్డు చైర్మన్ పదవి కూడా ఒకటనీ. ఇప్పటికే 19 కార్పొరేషన్లకు సంబంధించి ప్రభుత్వం జీవో కూడా విడుదల చేసిందనీ, వక్ఫ్ బోర్డు చైర్మన్ విషయంలో ప్రభుత్వం ఎందుకు ఆలస్యం చేస్తుందో తెలియడం లేదన్నారు. అదే జగన్ ప్రభుత్వంలో మైనారిటీలకు అనేక నామినేటెడ్ పదవులు ఇచ్చి మైనారిటీలకు న్యాయం చేశారని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు.

సహస్ర శివలింగాలకు దీపార్చన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): కార్తికమాసాన్ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరస్వామి వారికి ఆదివారం పంచామృత అభిషేకాలు, అర్చనలు చేశారు. సాయంత్రం స్వామి వారి ఆలయ ప్రాంగణంలో సహస్ర లింగార్చన జరిగింది. సహస్ర శివలింగాలకు అభిషేకాలు నిర్వహించిన అనంతరం ఆలయ అర్చకులు విశేషంగా అలంకరించి దీపార్చన నిర్వహించారు. ఆలయ వైదిక కమిటీ సభ్యుల పర్యవేక్షణలో జరిగిన పూజా కార్యక్రమాల్లో ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో ఆది దంపతులకు దీపార్చన చేశారు. దుర్గా మల్లేశ్వర స్వామి వార్లకు ఆలయ అర్చకులు పూజలు నిర్వహించగా, ఉత్సవ మూర్తుల వద్ద ఏర్పాటు చేసిన దీపార్చనను భక్తులు, ఆలయ అధికారులు, సిబ్బంది వెలిగించి సేవలో పాల్గొన్నారు.

క్లుప్తంగా

కరాటేలో బంగారు పతకం



పెనమలూరు: జాతీయ స్థాయి కరాటే పోటీలో జి. నైనా బంగారు పతకం సాధించింది. ఈ మేరకు యనమలకుదురుకు చెందిన కరాటే డో–ఫెడరేషనల్ కోచ్ ఎస్. దుర్గారావు ఆదివారం వివరాలు తెలుపుతూ.. హైదరాబాద్‌లో జరిగిన జాతీయ కరాటే పోటీల్లో కాటా ఐదు సంవత్సరాల ఎల్లో బెల్టు పోటీలో ఒకటవ తరగతి చదువుతున్న జి. నైనా బంగారు పతకం సాధించిందన్నారు. ఈ పోటీల్లో దాదాపు వెయ్యి మంది క్రీడాకారులు పాల్గొనగా నైనా సత్తా చాటిందని పేర్కొన్నారు.

వ్యాయామంతో ఎముకలకు బలం



పెనమలూరు: ఎముకల బలానికి వ్యాయామం చాలా అవసరమని ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ యద్దనపూడి మహేష్ అన్నారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో ఆదివారం ఎన్ఎస్ఎస్, వాకర్స్ అసోసియేషన్, నాగార్జున ఆస్పత్రి ఆధ్వర్యంలో ఎముకలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎముకల బలానికి శారీరక వ్యాయామం తప్పనిసరన్నారు. కాల్షియం, విటమిన్–డి ఉన్న ఆహార పదార్థాలు తినాలని సూచించారు. అనంతరం డాక్టర్ మహేష్‌ను నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో వాకర్స్ సభ్యులు రూప్ కుమార్, సతీష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర, వలంటీర్లు పాల్గొన్నారు.

సుందరయ్య రెడ్ వలంటీర్ల శ్రమదానం



గన్నవరం: స్థానిక బుద్ధవరం రోడ్డులో ఆదివారం సుందరయ్య రెడ్ వలంటీర్స్ దళ సభ్యులు శ్రమదానం చేశారు. మండల పరిషత్ కార్యాలయం నుంచి జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల వరకు రోడ్డును శుభ్రం చేశారు. రహదారికి ఇరువైపులా డ్రెయిన్లలో పూడికలు తొలగించి మురుగునీటి పారుదలను క్రమబద్ధీకరించారు. ఈ సందర్భంగా దళం నాయకుడు ఎంఎంబీ చారి మాట్లాడుతూ ప్రతి ఆదివారం దళ సభ్యులందరూ కలిసి రోడ్లు, డ్రెయిన్లు, ప్రభుత్వ ఆస్పత్రులు, ఆఫీస్‌లను పరిశుభ్రం చేయనున్నట్లు తెలిపారు. దళ సభ్యులు మిరప నాగేశ్వరరావు, కై లే ఏసుదాసు, మల్లంపల్లి ఆంజనేయులు, డాక్టర్ ఆంథోని తదితరులు పాల్గొన్నారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్



కంకిపాడు: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ డి. సందీప్ హెచ్చరించారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో సస్పెక్ట్ షీటర్లు, రౌడీ షీటర్లకు ఆదివారం ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎస్ఐ సందీప్ మాట్లాడుతూ షీట్లు ఉన్న వ్యక్తులు సత్ప్రవర్తనతో వ్యవహరించాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం, నేరాలు, ప్రజాశాంతికి భంగం వాటిల్లేలా వ్యవహరిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు.

గౌరీదేవిగా దర్శనమిచ్చిన భ్రమరాంబ అమ్మవారు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని పురాతన ఆలయమైన పాతశివాలయంలో భ్రమరాంబ అమ్మవారు ఆదివారం శ్రీగౌరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. దేవదాయ ధర్మదాయశాఖకు చెందిన శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం(పాతశివాలయం)లో కార్తిక నక్షత్రదీక్షా మహోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. అందులో భాగంగా శ్రీ భ్రమరాంబ అమ్మవారు రోజుకొక అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. ఈ క్రమంలో అమ్మవారు ఆదివారం గౌరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం అమ్మవారికి ఖడ్గమాల, త్రిశతి, సహస్రనామార్చన తదితర కార్యక్రమాలను నిర్వహించారు. శ్రీమల్లేశ్వరస్వామికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, మహాలింగార్చన, ఆలయ ప్రదక్షిణలు, పంచహారతులు తదితర వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి నటరాజన్ షణ్ముగం పర్యవేక్షించారు.

ఉత్సాహంగా కార్తిక వనసమారాధనలు


ఎమ్మెల్యే యార్లగడ్డకు జ్ఞాపికను అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు


నున్నలో ఉసిరిచెట్టుకు పూజ చేస్తున్న భక్తులు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ఎనికేపాడు విజ్ఞాన విహార్ స్కూల్ ఆవరణలో ఆదివారం ది కిరాణా మర్చంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వన సమారాధన ఉత్సాహంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు హాజరవ్వగా సంఘ సభ్యులు జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా రమా సహిత సత్యనారాయణస్వామి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండలంలోని రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు గ్రామాల్లోని వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొని ఆటపాటలతో సందడి చేశారు. అనంతరం పలువురికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు పురిమి సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షుడు జూలూరు నాగేశ్వరరావు, సెక్రటరీ కందేపు ఆనందరావు, ట్రెజరర్ కలవల సత్యనారాయణ, సభాధ్యక్షుడు కోట వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

నున్న గ్రామంలో..

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని మామిడి తోటల్లో ఆదివారం కార్తిక మాస వన సమారాధనలు జరిగాయి. చినకంచి వద్ద ఇస్కాన్ సంస్థ, అనేక కుటుంబాల వారు ఉసిరి చెట్టుకు పూజలు చేసి సత్యనారాయణ వ్రతం నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం మహిళలు మ్యూజికల్ చైర్స్, ఊయల, పిల్లలు క్రికెట్, బ్యాడ్మింటన్ ఆటలు ఆడుకున్నారు. చినకంచి, లక్ష్మారెడ్డి తోట, పలు చోట్ల కార్తిక వన సమారాధనలు జరిగాయి. విజయవాడ జ్యూట్ మర్చంట్స్ అసోసియేషన్, రజక సంఘం, ఇస్కాన్ సంస్థలు కార్తిక వన సమారాధనలు నిర్వహించారు.

వైభవంగా శివాలయ ధ్వజస్తంభం ఊరేగింపు


హనుమాన్‌జంక్షన్ సెంటర్‌లో ఊరేగిస్తున్న ధ్వజస్తంభం

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక బాపులపాడులోని ధర్మ కోనేరు చెరువు వద్ద నూతనంగా నిర్మిస్తున్న శ్రీ భమరాంబ సమేత శ్రీశైల బ్రహ్మ సూత్ర మరకత మల్లికార్జునస్వామి దేవస్థానం ప్రాంగణంలో ప్రతిష్ఠించనున్న ధ్వజస్తంభం ఊరేగింపు పట్టణ పురవీధుల్లో ఆదివారం వైభవంగా నిర్వహించారు. 45 అడుగుల రాతి ధ్వజస్తంభాన్ని ప్రత్యేకంగా అలంకరించిన ట్రాలీపై మేళతాళాలతో ఊరేగింపుగా తొలుత శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయానికి తీసుకువచ్చి విశేష పూజలు చేశారు. అనంతరం హనుమాన్‌జంక్షన్ ప్రధాన కూడలిలోని ప్రసిద్ధ అభయాంజనేయస్వామి దేవస్థానంలో ధ్వజస్తంభానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన కూడలిలో నిర్వహించిన మహిళల కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం ఐటీఐ రోడ్డు మీదుగా నూతన దేవస్థానం వద్దకు రాతి ధ్వజస్తంభం చేరుకుంది. ఈ నెల 20వ తేదీన శ్రీ భమరాంబ సమేత శ్రీశైల బ్రహ్మ సూత్ర మరకత మల్లికార్జునస్వామి దేవస్థాన ప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా నిర్వహించేందుకు చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నట్లుగా ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఘనంగా శతచండీ మహాయాగ సంకల్పం



నున్న(విజయవాడరూరల్): శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీస్వామి దేవస్థానం చినకంచిలో లోక కల్యాణార్థం ఐదు రోజులపాటు జరిగే శతచండీ మహాయాగ సంకల్పం వేదపండితుల సమక్షంలో ఆదివారం వైభవంగా ప్రారంభమైంది. ముందుగా గణపతి పూజ చేసి మహా సంకల్పాన్ని చెప్పారు. తదుపరి రుత్విక వరుణ పంచగవ్య ప్రాసన జరిపించారు. సోమవారం నుంచి సువాసినులచే కుంకుమార్చనలు జరుగుతాయని కార్యక్రమం నిర్వాహకుడు పెద్దిబొట్ల ఉమామహేశ్వరరావు తెలిపారు. భక్తులు లలితా సహస్రనామ పారాయణం చేశారు. కార్యక్రమాన్ని బ్రహ్మశ్రీ జొన్నవిత్తుల వెంకట్రామశర్మ, వీరవెంకట సత్యనారాయణరాజు పర్యవేక్షించారు.

మురుగుకాలువలో విజయనగర శాసనం

పురావస్తు పరిశోధకుడు ఈమని శివనాగిరెడ్డి


శాసనాన్ని పరిశీలిస్తున్న శివనాగిరెడ్డి తదితరులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఎంతో చారిత్రక ప్రాధాన్యం ఉన్న క్రీస్తు శకం 15వ శతాబ్దానికి చెందిన విజయనగర శాసనాన్ని పరిరక్షించి భద్రపరచాలని పురావస్తు పరిశోధకుడు, ది కల్చరల్ సెంటర్ ఆఫ్ విజయవాడ అండ్ అమరావతి (సీసీవీఏ), ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సంస్థ సీఈఓ డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ మధుచౌక్‌లోని సీసీవీఏ కార్యాలయం ఆవరణలో శివనాగిరెడ్డి ఆదివారం విలేకరులతో మాట్లాడారు. చారిత్రక సంపదను కాపాడి భవిష్యత్ తరాలకు అందించడానికి సీసీవీఏ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో భాగంగా బాపట్ల జిల్లాలో ఆదివారం పర్యటించామని శివనాగిరెడ్డి చెప్పారు. బాపట్ల జిల్లా మార్టూరు పట్టణంలోని పాత శివాలయం ముందు ఉన్న మురుగు కాలువలో క్రీస్తు శకం 15వ శతాబ్దానికి చెందిన శాసనం ఉందన్నారు. క్రీస్తు శకం 1453లో విజయనగర చక్రవర్తి మల్లికార్జున రాయులు స్థానిక సోమనాథ దేవాలయ నిర్వహణకు చేసిన సహాయ వివరాలతో పాటుగా ఆ గ్రామ చరిత్రకు సంబంధించిన విషయాలు ఈ శాసనంలో ఉన్నాయని చెప్పారు. శాసనాన్ని మురుగుకాలువలో నుంచి బయటకు తీసి శుభ్రం చేసి శాసనాన్ని పాత శివాలయం ఆవరణలో భద్రపరచడంతో పాటుగా శాసనంలో ఉన్న వివరాలను ప్రజలకు తెలిసే విధంగా ప్రత్యేకంగా బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ శాసనంలోని అంశాలను గ్రామస్థులకు వివరించానన్నారు. మణిమేల శివ శంకర్, భాగవతం వెంకటనారాయణాచార్యులు, కందుకూరి చరణ్, గుత్తి నాగవంశీ, శరత్ తనకు సహకరించారని తెలిపారు.

ముగిసిన వైద్య విద్యార్థుల మన్యం పర్యటన



లబ్బీపేట(విజయవాడతూర్పు): గిరిజన ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న అనారోగ్య సమస్యలపై అధ్యయనం చేసేందుకు విజయవాడ ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాల విద్యార్థులు చేపట్టిన యాత్ర ఆదివారం ముగిసింది. అల్లూరి సీతారామరాజు స్వాస్థ్య సేవా యాత్ర పేరుతో నేషనల్ మెడికోస్ ఆర్గనైజేషన్ ఆంధ్రప్రదేశ్ శాఖ ఆధ్వర్యంలో ఈ యాత్ర చేపట్టారు. అందులో భాగంగా ఆర్థోపెడిక్ అసోసియేషన్ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్ పవన్‌కుమార్‌తో పాటు ఐదుగురు వైద్య విద్యార్థులు ఈ యాత్రలో పాల్గొన్నారు. మూడు రోజుల పాటు చింతపల్లి తదితర ప్రాంతాల్లో పర్యటిస్తూ, గిరిజనులతో మమేకమై వారి జీవనశైలి, ఆహారపు అలవాట్లు, అనారోగ్య సమస్యలపై అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించారు. రక్తపోటు, మధుమేహం, ఇతర వ్యాధులపై అధ్యయనం చేశారు. గిరిజనులు ఎదుర్కొంటున్న పలు రకాల వ్యాధులను సైతం ఈ బృందం గుర్తించింది. ఈ యాత్రలో రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాలకు చెందిన వంద మందికి పైగా వైద్యులు, వైద్య విద్యార్థులు పాల్గొనగా, విజయవాడ ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాల నుంచి ఒక వైద్యుడు, ఐదుగురు వైద్య విద్యార్థినులు పాల్గొన్నారు.